క్లుప్తంగా

గెడ్డ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ బర్కత్ అలీ

మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు ఆర్ అండ్ బీ జంక్షన్ దరి శ్రీరాంనగర్ కాలనీలోని గెడ్డ బాటమ్ కాంక్రీట్ పనులకు శనివారం కార్పొరేటర్ బర్కత్, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రూ.14.50 లక్షలతో ఈ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపుతున్నామన్నారు. ఐదు నెలల వ్యవధిలో వార్డు సమస్యలకు పూర్తి పరిష్కారం లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు షేక్ బాబ్జి, హనుమంతు, రామారావు, సుశీల తదితరులు తెలిపారు.

వాకర్స్ పార్కులో మొక్కల పెంపకం



పార్కులో మొక్కలు నాటుతున్న బుచ్చయ్య

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో పచ్చదనం పరిరక్షణకు చర్యలు తీసుకున్నారు. పార్కు పూర్వ అధ్యక్షుడు, పర్యావరణ ప్రేమికుడు వాకర్ ఎన్.బుచ్చయ్య పర్యవేక్షణలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రస్తుత వాతావరణం మొక్కలు నాటేందుకు అనుకూలంగా ఉన్న దృష్ట్యా ఈ కార్యక్రమం నిర్వహించారు. తొమ్మిది పదుల వయసులో కూడా బుచ్చయ్య మొక్కలు నాటారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

మర్రిపాలెం: ఆటో ఢీకొని ఓ వ్యక్తికి గాయాలైన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఎన్ఏడీ కొత్త రోడ్డు సమీపంలో నివసిస్తున్న సిహెచ్.వెంకటరమణ పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం కంచరపాలెం మెట్టు మీదుగా తాటిచెట్లపాలెం రోడ్డు నుంచి బైకుపై వెళ్తుండగా అదే రోడ్డులో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో అతడికి గాయాలయ్యాయి. కుడి చేతికి ఫ్రాక్చర్ అయ్యింది. క్షతగాత్రుడు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కంచరపాలెం సీఐ ఎన్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ రమేష్‌రెడ్డి కేసు దర్యాప్తు చేపట్టారు.

త్వరలో కేంద్రీయ విద్యాలయ పూర్వ విద్యార్థుల సమావేశం



కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జీత్‌తో చర్చిస్తున్న పూర్వ విద్యార్థి కల్నల్ విజయ్ బలరాం

తాటిచెట్లపాలెం: త్వరలో కేంద్రీయ విద్యాలయ, వాల్తేర్ పూర్వ విద్యార్థుల సమావేశం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ స్కూల్ పూర్వ విద్యార్థి, ప్రస్తుతం హైదరాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఇండియన్ ఆర్మీ కల్నల్ విజయ్ బలరాం తెలిపారు. శనివారం కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జీత్‌ను కల్నల్ బృందం కలిసి, వివిధ విషయాలపై చర్చించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్‌లో అలూమ్ని నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. తాను ఈ స్కూల్‌లో 1988 వరకు చదివానని గుర్తుచేశారు. ఈ స్కూల్‌లో విద్యనభ్యసించిన వారు ఇండియాతో పాటు అమెరికా, యూరప్ వంటి దేశాల్లో ఉన్నత హోదాల్లో ఉన్నట్లు తెలిపారు. కరోనా ముందు వరకు 3 అలూమ్ని సమావేశాలను నిర్వహించి, స్కూల్‌లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు వెల్లడించారు. పూర్వ విద్యార్థుల తరఫున వివిధ షెడ్లు నిర్మించామని, వాటర్ కూలర్లు అందజేశామని, మొక్కలు పెంచామని, కెరీర్ కౌన్సెలింగ్ తరగతులు నిర్వహించామని, పేద విద్యార్థులకు సాయం చేశామని బలరాం చెప్పారు.

బాధ్యతగా ఓటు నమోదు



ఓటింగ్ ప్రాధాన్యంపై మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున



హాజరైన బుల్లయ్య కళాశాల విద్యార్థులు

- అందుబాటులో ఓటర్ హెల్ప్‌లైన్ యాప్
- కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున
- స్వీప్‌పై విద్యార్థులకు అవగాహన

సీతంపేట: ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు నమోదు చేయించుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. ఉత్తర నియోజకవర్గానికి సంబంధించి శుక్రవారం లంకపల్లి బుల్లయ్య కళాశాలలో సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్(స్వీప్)పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా ప్రతి ఒక్కరూ సులభంగా ఓటు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. స్వీప్ కార్యక్రమం ద్వారా అర్హత గల ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేస్తున్నామని చెప్పారు. కొత్త ఓటరు నమోదు, ఓటరు కార్డులో మార్పులు, చేర్పులకు స్వీప్‌లో అవకాశం ఉందన్నారు. యువత ప్రధానంగా ఓటు హక్కు గొప్పతనాన్ని తెలుసుకుని వినియోగించుకోవాలని సూచించారు. ఫారం 6 నింపి కొత్త ఓటరు నమోదు, ఫారం 8 నింపి ఓటరు కార్డులో మార్పులు, చేర్పులు, సవరణలు చేసుకోవచ్చని వివరించారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటు పొందడానికి అర్హులని పేర్కొన్నారు. ఓటరు జాబితా సవరణ 2024 కోసం ఇప్పటి నుంచి ప్రజల్లో చైతన్యం కలిగిస్తూ ఓటరు నమోదు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొనాలి

అర్హత పొందిన ప్రతి విద్యార్థి ఓటరుగా నమోదు కావాలని, ఇతరులను కూడా ప్రోత్సహించాలని కలెక్టర్ మల్లికార్జున కోరారు. ఓటరుగా నమోదు కావడమే కాకుండా ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. పట్టణ ప్రాంతంలో ఓటింగ్ నమోదు శాతం చాలా తక్కువగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఓటింగ్ ప్రక్రియలో పాల్గొని ప్రజాస్వామ్యాన్ని బలపర్చాలన్నారు. ఇతర జిల్లాల నుంచి చదువుకునేందుకు ఇక్కడికి వచ్చిన విద్యార్థులు కూడా ఫారం 8 ద్వారా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఓటు నమోదు దరఖాస్తులను అందజేశారు. భీమిలి ఆర్డీవో భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యానికి గట్టి పునాది వేయాలని కోరారు. ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఓటు హక్కుపై విద్యార్థులు ప్రసంగించారు. కార్యక్రమంలో ఎస్‌డీసీ వెంకటేశ్వర్లు, సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ అనంద కుమార్, బుల్లయ్య కళాశాల ప్రిన్సిపాల్ చక్రవర్తి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

వార్డుల్లో అభివృద్ధి పరుగులు



24వ వార్డు నక్కవానిపాలెంలో శంకుస్థాపన చేస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ పద్మారెడ్డి



47వ వార్డు అంబేడ్కర్ ఎస్టేట్‌లో భూమిపూజ చేస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ కామేశ్వరి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులో అభివృద్ధి పనులకు శనివారం కార్పొరేటర్ సాడి పద్మారెడ్డితో కలిసి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు శంకుస్థాపన చేశారు. నక్కవానిపాలెంలోని ఇందిరాగాంధీ పార్కు అభివృద్ధికి రూ.8 లక్షలతో మరమ్మతులు చేపట్టనున్నారు. రూ.30 లక్షలతో నక్కవానిపాలెంలో తాగునీటి పైప్‌లైన్, యూజీడీ డ్రైనేజీ మరమ్మతుల జరపనున్నారు. కార్యక్రమంలో ఏఈ శ్రీరామ్మూర్తి, వాటర్ వర్క్స్ ఏఈ రెహ్మాన్, నాయకులు సాడి కేశవరెడ్డి, మురళీకృష్ణారెడ్డి, ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయ ట్రస్టీ చైర్మన్ నక్క అప్పలరెడ్డి, సీతాకుమారి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంతాల్లో శంకుస్థాపన

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు పెదకొత్తూరు, అంబేడ్కర్ ఎస్టేట్, సురేష్‌రామ్‌నగర్, బాపూజీనగర్, అరుంధతి నగర్ కొండవాలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు శనివారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరితో కలిసి శంకుస్థాపన చేశారు. సుమారు రూ.40 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు జోన్-5 డీఈ భరణికుమార్ తెలిపారు. కొండవాలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు, మెట్ల మార్గాలకు మరమ్మతులు, డ్రెయిన్ల నిర్మాణాలకు నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించినట్లు కె.కె.రాజు చెప్పారు. ముందుగా బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఈ అర్చన, వర్క్ ఇన్‌స్పెక్టర్ కంటిపాము గురువోజీ, వార్డు నాయకులు వసంతల అప్పారావు, రమణ, సురేష్, నరసింగ్, భోగి, అనిల్, చందురెడ్డి, సాయి, జయకుమార్, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

సంగీత సంస్థల ఏర్పాటు భేష్

సినీ సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్



విశాఖ గాయనీ గాయకుల సాంస్కృతిక సంఘం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్.పి.పట్నాయక్

సీతంపేట: కొత్తగా ఏర్పాటు కానున్న విశాఖ గాయనీ గాయకుల సాంస్కృతిక సంఘం పోస్టర్‌ను ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్ ఆవిష్కరించారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విశాఖకు చెందిన గాయనీ గాయకులు కలిసి సంగీత సంస్థలు ఏర్పాటు చేసుకోవడం వారి ఐక్యతకు నిదర్శనమన్నారు. సింగర్లు నిబద్ధతతో పనిచేసి సంగీతానికి ప్రాధాన్యమిస్తూ నిత్యం సాధన చేయాలని సూచించారు.

పౌర గ్రంథాలయం బాగుంది..

ముందుగా పబ్లిక్ లైబ్రరీలోని ప్రతి విభాగాన్ని ఆర్.పి.పట్నాయక్ తిలకించారు. ఇంత చక్కటి గ్రంథాలయాన్ని ఎక్కడా చూడలేదన్నారు. పాఠకులు, విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. కార్యక్రమంలో నూతన సంస్థ కార్యవర్గ సభ్యులు డి.భూపతిరావు, భయ్యా శ్రీనివాస్, ఎం.వి.ఆర్.నాగేశ్వరరావు, ఫణిస్వామి, సన్‌మూర్తి, శశికళ, పట్టం వెంకటేష్, నాంచారయ్య, వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.డి.పాల్, నరవ ప్రకాశరావు, పౌర గ్రంథాలయ కార్యదర్శి డి.ఎస్.వర్మ, సంయుక్త కార్యదర్శి డి.వి.సూర్యారావు, గ్రంథ పాలకులు దుర్గారాణి పాల్గొన్నారు.

నేరాల కట్టడికి ప్రత్యేక చర్యలు



ఫోర్త్‌టౌన్ పోలీసులకు సూచనలిస్తున్న క్రైం ఏసీపీ వెంకటరావు

సీతమ్మధార: స్థానిక ఫోర్త్‌టౌన్ క్రైం పోలీస్ స్టేషన్‌ను శనివారం క్రైం ఏసీపీ వెంకటరావు సందర్శించారు. రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. రాత్రి పూట బందోబస్తుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ నేరాల కట్టడికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచనలు చేశారు. నేరాలకు పాల్పడుతున్న వారిని పట్టుకోవాలని ఆదేశించారు. నైట్ డ్యూటీలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్ఐ ఖగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ టమాటాకు బారులు



సీతమ్మధార రైతుబజారు వద్ద బారులు తీరిన వినియోగదారులు

సీతమ్మధార: సబ్సిడీ టమాటా కోసం సీతమ్మధార రైతుబజారులో శనివారం వినియోగదారులు బారులు తీరారు. కిలో టమాటా రూ.50 చొప్పున రెండు కౌంటర్లలో విక్రయించారు. ఉదయం నుంచి ఆధార్, రేషన్ కార్డులతో రైతుబజారు బయటకు వరకు వినియోగదారులు క్యూ కట్టారు. 120 కేట్ల సబ్సిడీ టమాటాలు విక్రయించినట్లు రైతుబజారు ఈవో కొండబాబు తెలిపారు. సహాయకుడు సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

25న రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జేఏసీ సమావేశం

దాబాగార్డెన్స్: ఏపీ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జేఏసీ, ఈపీడీసీఎల్ డిస్కం కార్యవర్గ సమావేశం ఈ నెల 25న విశాఖలో గల వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్నట్లు జేఏసీ చైర్మన్ వీఎస్ఆర్‌కే గణపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి నిర్వహించనున్న సమావేశానికి ఏపీ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ కేంద్ర కార్యవర్గ ముఖ్య నాయకులు పాల్గొంటున్నట్టు తెలిపారు. డిస్కం పరిధిలో గల అన్ని కార్మిక సంఘాలు, అసోసియేషన్లు, డిస్కం ముఖ్య ప్రతినిధులు, జేఏసీ కార్యవర్గ సభ్యులు పాల్గొనాలని కోరారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం



సచివాలయ సిబ్బందితో సమీక్షిస్తున్న డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు

మురళీనగర్: సచివాలయాలకు వస్తున్న ప్రజల వినతులకు సత్వర పరిష్కారం చూపాలని జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు సూచించారు. ఇటీవల వార్డులో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించిన అనంతరం ఆయన శనివారం 280 సచివాలయాన్ని సందర్శించి సెక్రటరీలు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు సకాలంలో చేరేలా చూడాలన్నారు. ప్రజలతో సఖ్యతగా ఉంటూ వారి సమస్యలను సావధానంగా వింటూ పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. వివిధ పథకాల అమలు, సచివాలయ సిబ్బంది పనితీరును సమీక్షించారు. లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కార మార్గం చూపారు. కార్యక్రమంలో విశాఖ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఐ.రవికుమార్, వార్డు శివాలయ బోర్డు చైర్మన్ ఎస్.వి.రమణ, ధర్మకర్త ఎం.వెంకటలక్ష్మి, వార్డు సీనియర్ నాయకులు, జె.వెంకటరావు, బి.శివరామ ప్రసాద్, బి.శంకర్, కె.మున్నా, ఎస్.పాండు, బి.అప్పారావు, కె.శివకుమార్, మహిళా నాయకులు ఆర్.వరలక్ష్మి, ఎం.లక్ష్మి, ఎ.లక్ష్మి, ఐ.పూర్ణ, దేవి, వలంటీర్లు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో జీవీఎల్ పర్యటన



విశాఖ రైల్వే స్టేషన్‌లో పర్యటిస్తున్న ఎంపీ జీవీఎల్ నరసింహారావు

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో శనివారం రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా తాను నియమితుడైనందున రైల్వేస్టేషన్‌లో పరిస్థితులను తెలుసుకునేందుకు పర్యటిస్తున్నట్లు తెలిపారు. ముందుగా వీఐపీ లాంజ్‌లో స్టేషన్ రీ డెవలప్‌మెంట్ బ్లూప్రింట్ గురించి స్టేషన్ అధికారులను ఎంపీ అడిగి తెలుసుకున్నారు. రాబోయే రెండేళ్లలో విశాఖ స్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో మెరుగుపరచనున్నట్లు తెలిపారు. జోన్ విషయమై స్థానిక జీవీఎంసీ, రాష్ట్ర ప్రభుత్వాలతో స్థల విషయం ముడిపడి ఉందని, ఇవన్నీ త్వరలోనే పూర్తయి జోన్ కార్యాచరణ కూడా ప్రారంభమవుతుందన్నారు. విశాఖ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అందుబాటులో ఉన్న అన్ని సదుపాయాలను పరిశీలించారు. పలువురు ప్రయాణికులతో ఆయన మాట్లాడారు. ఇటీవల తరచుగా కాకినాడ మెము ఎక్స్‌ప్రెస్ రద్దు చేస్తున్నారని, దీనివల్ల ఉద్యోగాలు చేసుకునే నగర పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రయాణికులు జీవీఎల్‌కు తెలిపారు. పర్యటనలో వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి, స్టేషన్ డైరెక్టర్ వెంకటరాజు, ఇతర అధికారులు, సిబ్బంది, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయాల్లో విశేష పూజలు

కంచరపాలెం: అధిక శ్రావణ మాస శుద్ధ చవితి సందర్భంగా శనివారం వెంకన్న ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. గొల్లకంచరపాలెం కోదండ సీతారామ, ధనలక్ష్మీదేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు శ్యామాచార్యులు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందించారు.

- తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, అర్చనలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సుప్రభాత సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అలవేలుమంగ అన్నసమారాధన భవంతిలో అన్నదానం చేశారు.

ఘనంగా గోదాదేవి జన్మదినోత్సవం

వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవి(ఆండాల్ అమ్మవారు) జన్మదినోత్సవం సందర్భంగా శనివారం తిరునక్షత్ర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీవారి సుప్రభాత సేవ అనంతరం ఉదయం 9 గంటలకు గోదాదేవి ఉత్సవ విగ్రహాన్ని ఆలయ ప్రదక్షిణ చేయించారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

వైభవుడి ఆలయానికి ఫ్యాన్ల వితరణ



వేంకటరాఘవరావుకు వైభవుడి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఈవో ప్రసాద్, శేషాచార్యులు

మురళీనగర్: ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయానికి వేంకటరాఘవరావు దంపతులు విరాళం అందించారు. భక్తుల కోసం ఆలయ మండపంలో ఏర్పాటు చేయడానికి రూ.60,000 విలువైన 12 ఫ్యాన్లను శనివారం ఈవో బండారు ప్రసాద్‌కు అందించారు. వేంకటరాఘవరావు దంపతులను ఈవో, ఆలయ అర్చకుడు శేషాచార్యులు సత్కరించి స్వామి చిత్రపటాన్ని బహూకరించారు.

అనూప్‌కుమార్‌కు భావోద్వేగ వీడ్కోలు



వీడ్కోలు వేడుకల్లో డివిజన్ అధికారులతో డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి



అనూప్‌కుమార్, పారిజాత సత్పతి దంపతులు

తాటిచెట్లపాలెం: డివిజనల్ రైల్వే మేనేజర్‌గా ప్రజల మన్ననలు పొందిన వాల్తేరు డివిజన్ పూర్వ డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి, పారిజాత సత్పతి దంపతులకు అధికార, సిబ్బంది బృందం చిరస్మరణీయ రీతిలో భావోద్వేగ వీడ్కోలు పలికింది. శనివారం సాయంత్రం రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్ క్లబ్‌లో వాల్తేర్ డివిజన్ అధికారులు, సిబ్బంది ప్రత్యేక వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. విధులపై అంకితభావం, నిబద్ధత, మక్కువ కలిగిన నాయకుడిగా ఎందరో ఉద్యోగులకు ఆయన మార్గదర్శకులయ్యారని అధికారులు ప్రశంసించారు. అనూప్‌కుమార్ నేతృత్వంలో డివిజన్ నూతన శిఖరాలకు చేరుకుందని, ప్రయాణికుల సౌకర్యాల కల్పనలో, డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడపడంతో ఎన్నో వినూత్న ప్రాజెక్టులకు ఆయన రూపకర్త, మార్గదర్శి అని కొనియాడారు. ఈయన హయాంలో మునుపెన్నడూ చేరుకోని రికార్డులను చేరుకుందని, లోడింగ్‌లో, ఆదాయార్జనలో భారతీయ రైల్వేలోనే వాల్తేర్ డివిజన్‌ను 5వ స్థానంలో నిలిపిన ఘనత అనూప్‌కుమార్ సత్పతికే దక్కుతుందని సహోద్యోగులు అన్నారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ప్రెసిడెంట్‌గా అనూప్‌కుమార్ సత్పతి సతీమణి పారిజాత సత్పతి సైతం తనదైన శైలిలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. వాల్తేర్ డివిజన్ వివిధ బ్రాంచ్‌లకు చెందిన అధికారులు, సిబ్బంది, ఈకార్వో ప్రతినిధులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవలోనే జన్మ సార్థకత



మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సత్యదేవ్, గురుప్రసాద్, రాజు

తాటిచెట్లపాలెం: సమాజానికి నిస్వార్థంగా చేసే సేవ, ఆధ్యాత్మిక జీవన విధానంలో తరించడంతోనే మానవ జన్మ సార్థకత అవుతుందని జగద్గురు పీఠం (వరల్డ్ టీచర్ ట్రస్ట్) డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ అన్నారు. మాతృశ్రీ కృష్ణకుమారి 73వ జయంతి సందర్భంగా శనివారం తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఈకే సంస్కృతి సదన్‌లో జగద్గురు పీఠం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. కృష్ణకుమారి తన జీవిత కాలంలో దేశ విదేశాల్లోని సంస్థ కుటుంబాల వారికి చేసిన సేవలను ప్రశంసించారు. ముఖ్య అతిథి ధనిష్టా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కె.చంద్రశేఖర గురుప్రసాద్ మాట్లాడుతూ నాది, నేను అనే భావనను విడిచిపెట్టి సహృదయంతో చేసే సేవ పవిత్రమైనదన్నారు. పార్వతీకుమార్ చూపిన బాటలో ధనిష్టా ఫౌండేషన్ వివిధ రంగాల ద్వారా దీనజనులకు సేవలందిస్తోందని చెప్పారు. మాతృశ్రీ కృష్ణకుమారి పేరిట సంస్కృతి సదన్‌లో స్వయం ఉపాధి కల్పనలో భాగంగా శిక్షణ పొందుతున్న మహిళలకు సహాయ సహకారాలు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. వరల్డ్ టీచర్ ట్రస్ట్ కార్యదర్శి బి.ఆర్.కె.రాజు మాట్లాడుతూ సంస్కృతి సదన్‌లో ఇప్పటి వరకు సుమారు 1,600 మందికి వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు. టైలరింగ్ శిక్షణలో ఉత్తీర్ణులైన 40 మంది మహిళలకు సర్టిఫికెట్లు, అవసరమైన వారికి ఉచితంగా కుట్టు మిషన్లను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో బి.ఉషారాణి, గొల్లపూడి రవికుమార్, దాట్ల రాధ, దుగ్గిరాల భరత్ తదితరులు పాల్గొని సహకరించారు.

కేవీలో బాలవాటిక ధ్రువపత్రాల పరిశీలన

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయ, వాల్తేర్‌లో శనివారం బాలవాటిక-3కు సంబంధించిన అడ్మిషన్ల ప్రక్రియ మొదలైంది. ఆయా జాతీయ విద్యావిధానం నియమ నిబంధనలను అనుసరిస్తూ వివిధ కేంద్రీయ విద్యాలయాల్లో బాలవాటిక-1, 2, 3లను ప్రారంభించారు. దీనిలో భాగంగా కేవీ, వాల్తేర్‌కు ఈ సంవత్సరం మొదటిగా కేవీ-3కు అనుమతులు లభించాయి. దీనికి సంబంధించి దరఖాస్తుదారుల ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమం ప్రైమరీ స్కూల్‌లో ప్రారంభమైంది. సుమారు 357 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో కేవలం 40 మంది అర్హులను గుర్తించి, సీట్లు కేటాయించనున్నట్లు ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం వి.ఎం.శైలజ తెలిపారు. ఈ 40 సీట్లలో 10 సీట్లను ఆర్టీఐ కింద కేటాయించగా, మిగిలిన 30 సీట్లు వివిధ కేటగిరీలకు చెందిన విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. ఈ ఏడాది ఒక సెక్షన్‌ను ప్రారంభించనున్నారు. ఈ ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే జరగనుంది. ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 29 నుంచి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నారు.

కేవీలో వేడుకగా కెప్టెన్ల ఎంపిక

తాటిచెట్లపాలెం కేంద్రీయ విద్యాలయ, వాల్తేర్‌లో శనివారం ఇన్వెస్టిట్యూర్ వేడుకలు,(నాయకుల ఎంపిక) ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి 8 మందిని కెప్టెన్లుగా, 8 మందిని వైస్ కెప్టెన్లుగా, 8 మందిని హౌస్ కెప్టెన్లగా మొత్తం 24 మందితో కూడిన కౌన్సెల్‌ను ఏర్పాటు చేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ కమల్‌జీత్ ఎంపికైన ఈ నాయకులకు బ్యాడ్జీలను అందజేసి, ఆశీర్వదించారు. కార్యక్రమంలో వై.విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయిని వి.ఎం.శైలజ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గరికిపాటి ప్రవచనాలు



గరికిపాటి నరసింహారావుకు ఫ్రూట్ బాస్కెట్ అందజేస్తున్న కె.కె.రాజు



ప్రవచనాల కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

సీతమ్మధార: మహా సహస్రావధాని, పద్మశ్రీ పురస్కార గ్రహీత గరికిపాటి నరసింహారావు ఆధ్యాత్మిక ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అల్లూరి సీతారామరాజు సమితి ఆధ్వర్యంలో రెండో రోజు శనివారం సాయంత్రం 6 గంటలకు సీతమ్మధార క్షత్రియ కల్యాణ మండపంలో కొనసాగిన కార్యక్రమంలో మనుచరిత్ర అంశంపై గరికిపాటి ఆధ్యాత్మిక ప్రవచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయనను నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు కలిసి ఫ్రూట్ బాస్కెట్‌ను బహూకరించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు డి.తిరుపతిరాజు, చైర్మన్ ఎం.ఎ.స్.ఎస్.రాజు, సెక్రటరీ డి.ఎస్.పి.వర్మ, కోశాధికారి కె.శ్రీహరిరాజు, జాయింట్ సెక్రటరీ పి.వి.కె.హనుమాన్‌రాజు, ఈసీ మెంబర్లు, విజయ నిర్మాణ్ సంస్థ అధినేత విజయకుమార్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.